# నిట్టూర్పు

ఇటువంటి ఆలోచనలు శారదకు రావటం ఇవాళకొత్తేమీకాదు. ఎప్పుడూ కూడా గడిచిపోయిన రోజులే ఎంత మధురంగా వున్నాయి అనుకుంటూ, భవిష్యత్తులోకి భయంగా చూస్తూ వుంటుంది. ఆనాడు కాలేజీలో చదువుతున్న రోజుల్లో, తాను చిన్నప్పుడు అమ్మ చాటున వుండి గొబ్బెమ్మలుచేసి గుమ్మడిపూలు అలంకరిస్తూ మురిసిపోయిన రోజులు అన్నీ గుర్తుకు తెచ్చుకొని విలవిల లాడిపోతూ వుండేది ఎలాగో అలాగ బి. ఏ. పూర్తి చేసింది. తల్లిదండ్రులు త్వరగా పెళ్ళిచేసి శారదను అత్తారింటికి పంపాలని తపన పడుతూ వుండే వారు. శారద ఎంతవద్దన్నా ఆ ముహూర్తం రానే వచ్చింది. తీరా అత్తారింటికి వచ్చినతర్వాత, తాను కాలేజీలో చదువుతున్న రోజులు, అప్పటి స్నేహితురాళ్ళు కళ్ళల్లో మెరిసి కలవర పడుతూ వుండేది. భర్త తనను ఎంత అప్యాయంగా చేరదీసి పలకరిద్దామన్నా శారద మనస్సు మాత్రం వెనక ప్రపంచంలోనే తారసలాడుతూ వుండేది.

భర్త ప్రభాకర్ ఆమెను సరిగ్గా అర్థం చేసుకోవటం ఆమె అదృష్ట మనే చెప్పాలి. కాని శారద ధోరణిమాత్రం మారటంలేదు.

ఇవాళ వరండాలో కూర్చుని నిపాందిగా ఆచనల్లో మునిగి పోయింది. నలభయి ఏళ్ళు నిండాయి. మొత్తం ఆయుష్షులో సుమారు సగం గడచిపోయింది. తప్పటడుగులు వేసుకుంటూ జీవిత పథంలో ప్రప్రథమంగా నడక సాగించిన శారద, గొబ్బెమ్మలు చేయటం అయిపోయింది. కాలేజీ విద్యార్థిని అనిపించుకుంది. నలుగురిచేతా, శారదమ్మ పెళ్ళికూతురాయెనే అని పాడించుకుంది. తనను అమ్మా అని పిలిపించుకోవడమూ అయిపోయింది. ముచ్చటలు ముచ్చటలు తీరిన శారదకు యిప్పుడు మిగిలిందల్లా, నలుగురు పిల్లలూ, భర్త.

ఆమె హృదయాన్ని అసంతృప్తి, పిరికితనం, ఆవరించుకొన్నాయి. గడచిన రోజులు ఆమె మనస్సుకు యెంతో తృప్తి నిస్తున్నాయి, అంతే, ఆమె ఆలోచనా ప్రవాహానికి అడ్డు లేకుండా పోతోంది. తనని అమ్మా అమ్మా అని పిలుస్తూ వెంట వెంట తిరుగుతున్న పిల్లలు చాలా దూరమయి పోతున్నట్లు కనిపిస్తున్నారు. తనను యింక అమ్మా అని పిలువరేమోనని భయపడుతోంది. వాళ్ళూ పెద్దవాళ్ళయి పోతున్నారు. ఎక్కడికో ఎగిరిపోతారు రెక్కలతో. అవును యివ్వాళ తాను తన తల్లిని అమ్మా అని పిలిచి ఎన్ని రోజులయింది తన భర్త ప్రభాకర్ ఎంతో ఎడమయి పోతున్నాడు అదివరకు మాదిరిగా దగ్గరగా దగ్గరగా రావటంలేదు ఎప్పటి కప్పుడు తాను, తన ఆఫీసు, అంతేతప్ప యిల్లూ, భార్యా పిల్లలు అనే మాటే లేదు. తెల్లారి లేవటంతోనే గడియారం పెద్ద

ముల్లుతో పోటీపడి పరుగెత్తుతూ వుంటాడు. ఎంత వేగంగా పరుగెత్తినా, ప్రభాకర్ ఆఫీసుకు వెళ్ళేటప్పటికి, తనకంటే ముందుగానే గడియారం చిన్నముల్లు పది మీదికి వచ్చి కూర్చుంటుంది. తన భర్త పరుగును, వేగాన్ని అందుకోవటానికి శారద సతమతమవుతూ వుంటుంది. ఇక పిల్లలూ అంతే. బళ్ళోకి పరుగెత్తుకు వెళ్ళటమే ఇక ఇంట్లో మిగిలేది శారద ఒక్కతే. ఈ ఒంటరి తనమే ఆమెకు పిరికితనాన్ని కూడా స్నేహితురాలిగా చేర్చింది.

మనస్సులో వున్న ఆవేదన. స్పష్టంగా మొహంలో కూడా కనిపిస్తోంది. అద్దంముందు నిలబడితే శారదకు తన రూపు కనబడటం లేదు. చిన్నప్పుడు పరికిణీలు కట్టుకొని తిరిగిన తనఆకృతి. వసంతతో తీసుకున్న ఫొటో కనిపిస్తున్నాయి కళ్ళు టపటప మనిపిస్తూ, నిశ్చలంగా చూసింది తానే; ఆ అద్దంలో కనిపిస్తున్న బొమ్మ తానే ఎవరో కాదు. నుదురు మీద సన్నగా ముడతలు. మొద్దుబారిన పెదిమలు, లోతుగా పోయిన కళ్ళు. అక్కడక్కడ తళతళ మెరుస్తూన్న తెల్లజుట్టు. కళ్ళజోడు. అవును నేనే నేనే అనుకుంది శారద నేను యీ నలభై ఏళ్ళల్లోను ఏం సాధించాను? నా కోర్కెలు ఏమి నెరవేరాయి? నా ఆశలు, ఆశయాలు ఎంత వరకు తీర్చుకున్నాను? ఏమో! నేనే ఓడిపోయాను - ఏమీ పొందలేక పోయాను. నేను వసంతను కాలేక పోయాను. సుశీల పొందిన జీవితానుభవం నాకులేదు. ఆనాడు, వసంతా, సుశీల యిద్దరూకూడా నన్ను చూసి అసూయ పడేవాళ్ళు నా అందాన్ని చూసి వాళ్ళు పొగడేవాళ్ళు. నేనూగర్వపడ్డాను. మురిసిపోయాను. కాని యీనాడో ఏమీ లేదు. వసంత పెద్ద డాక్టరు. సుశీల భర్త పెద్ద డాక్టర్ వాళ్ళింటికి వెళ్ళి నా మొహం చూపించాలంటే ఎంతో బిడియంగా

వుంటుంది. సిగ్గేస్తుంది. వాళ్ళ దర్జా ముందర నేను ఏ పాటి? నా భర్త ఒక ఆఫీసులో గుమాస్తా! వాళ్ళ అంతస్థుకు, మా అంతస్థుకు ఎక్కడ పోలిక! ఎంత అంతరం? వాళ్ళ కీర్తి, ప్రతిష్ఠ, గౌరవం, సంఘంలో వాళ్ళ పలుకుబడి మనకేది? మనము ఒకళ్ళం వున్నా మని ఎవరు గుర్తిస్తున్నారు: నేను ఏది కావాలని కోరుకున్నానో, అదే పొందలేక పోయాను. ఇదే నా విచారం. ఇదే నా అసంతృప్తి అనుకుంటూ శారద తెగ ఆరాటపడుతోంది.

గట్టిగా ఇంట్లో ఏది కొనాలన్నా కూడా వెనకాముందూ చూడా లసిందే. పిల్లలను తాను కోరినట్లు పెంచలేక పోతున్నాననే బాధ. వ్యధ కూడా శారదను పట్టుకొని పీడిస్తున్నాయి. తన చిన్నప్పుడు పుట్టినరోజు వచ్చిందంటే ఏంతో అట్టహాసంగా వుండేది. ఒక పిండి వంటలే కాదు, కొత్తబట్టలే కాదు, చుట్టుప్రక్కల స్నేహితులు ఎంతో మంది వచ్చి ఆమెకు అభినందనలు చెప్పే వారు. తన పుట్టినరోజు వచ్చిందంటే అందరికీ పండగే. అయితే యీనాడు పిల్లల పుట్టిన రోజున అశక్తురాలయి వుండిపోవలసి వస్తోంది. తాను గట్టిగా ఏమీ కొనలేని అసమర్ధతలో వుండిపోయింది. వసంత పిల్లలను చూసినా, సుశీల పిల్లలను తలచుకున్నా. ఇదే శారదకు తీరనిబాధ, ఆవేదన. ఆరాటం. నిజానికి యీనాడు శారద పుట్టినరోజు. ఆ విషయం ఆమె ఎన్నడో మరిచే పోయింది. భర్త ప్రభాకర్‌ను చూస్తుంటే ఆమెఒళ్ళు జలదరిస్తూంది. ఈయనేనా, ఆనాడు తనకు పసుపు బట్టలతో మంగళ సూత్రం కట్టిందీ అనుకుంటూ విడ్డూర పడుతుంది. పెళ్ళి పీటల మీద ప్రభాకర్ మొహంలో వెలసిన ఆ కళ యీనాడేది. ఆఫీసునుంచి ఆయాసపడుతూ ఫైళ్ళకట్ట ఒక చేత్తోనూ, కూరల సంచి రెండో చేత్తోనూ పట్టుకుని వస్తున్న భర్తను చూస్తుంటే

బావురుమని ఏడవాలనిపిస్తుంది శారదకు. అవును; తాను కూడా ఆయనతోపాటే పెరిగింది. అవును తాను కూడా ఆనాటి కళాకాంతుల్ని కోల్పోయింది. దానికి కారణం ఎవరు, అని ప్రశ్నిస్తుంది. తన యీడే వసంతదీను, సుశీలదీనూ. తనమాదిరిగానే వున్నారా! వాళ్ళ భర్తలు, తన భర్త మాదిరిగానే వున్నారా; ఇవి కేవలం ప్రశ్నలే. వాటికిజవాబులుగాని, అలాంటిజవాబులకు కారణాలుకాని యెవ్వరిని అడిగినా ప్రయోజనం లేదు. లాభంలేదు. శారదకు యిందువల్లనే హృదయభారం. ఈనాడు తన భర్త యింట్లోలేడు. ఆఫీసు పనిమీద పొరుగూరు వెళ్ళాడు. అసలు నిన్ననే యింటికిరావలసింది, ఇంటికి వస్తానని చెప్పాడు కూడా; కాని రాలేదు. అన్నిటికంటె ఆఫీసుపనులే యెక్కువ. వాటికే ప్రాధాన్యం యివ్వాలి. ఇవ్వాలిసిందే కూడా అని తనలోతాను గుణించు కుంటోంది శారద. కాకపోతే యివాళకూడా ఆయన ఇంటికి రాకుండా వుంటారా! ఇదే వసంత కొంపలో జరుగటానికి ఆస్కారం వుందా ! సుశీల యింట్లో ఆమె భర్త యిట్లా ప్రవర్తించగలడా! పిల్లలు పుట్టిన రోజు అయినా కూడా యింటిపట్టున లేకుండా వుంటానికి వాళ్ళు. శారద "భర్తలు" కారు! కసిగా ఆలోచించుకుంటూ ఆయాస పడుతోంది శారద పెద్ద నిట్టూర్పు విడుస్తూ.

ఇంతలోకి అమాంతంగా చిట్టి వచ్చి, 'అమ్మా నాన్నొచ్చారే' అన్నది.

శారద తల తిప్పి పిల్లవంక కూడా చూడలేదు. ఆ అమ్మాయి సంతోషాన్ని, ఉద్వేగాన్ని శారద పంచుకున్నట్లు ప్రవర్తించలేదు. పిల్లలు ఆనందంగా గంతులు వేస్తూ, యిల్లంతా హడావిడి చేస్తున్నారు. ప్రభాకర్ గబగబా వచ్చి శారదముందు నిలబడ్డాడు! ఇదిగో పిల్లలకు బట్టలు, తినటానికి ఏదైనా చెయ్యి. "ఇవ్వాళ

అమ్మాయి పుట్టినరోజు. తెలీదా ?" అంటూ ఓ సంచి అందించాడు ప్రభాకర్.

శారద మొహం విప్పారింది. తన ఆలోచన లన్నింటిని క్షణంసేపు కట్టేసింది. ఎన్నడూ తన భర్త యిన్ని బట్టలుగాని, యిన్ని పదార్థాలుగాని తీసుకురాలేదే. ఇవ్వాళ యేమిటా విశేషం అనుకుంది. కాని అడగలేదు. చకచక వంటింట్లోకి వెళ్ళింది. ఇట్టే తిను బండారాలు తయారుచేసింది. పిల్లలకు కొత్తబట్టలు యిచ్చింది. తను కిలకిలలాడుతూ నిలబడింది.

"శారదా ! ఓసారి లోపలికి రా'' అన్నాడు ప్రభాకర్. శారద మెల్లిగా అడుగులు వేసుకుంటూ గదిలోకి వెళ్ళింది. గదిలో అలమారు తలుపులు తెరిచాడు. 'ఏముందో చూడు' అన్నాడు కళ్ళు పెద్దవి చేసి.

శారద మొహం యింత చేసుకొని అలమారలో అట్టపెట్టెను తీసింది. ఆ అట్టపెట్టెలో పట్టుచీర, నీలం పట్టుచీర. ఆనాడు వసంత పేరంటానికి కట్టుకువచ్చిన చేరె. 'వసంత ఆ చీరెలో ఎంత అందంగా వుందో చూడండి' అని చప్పున నాలుక కరుచు కున్న సంగతి శారదకు గుర్తు వచ్చింది. అలాంటి చీరె తనకు యీ జన్మలో కట్టుకునే యోగ్యత లేదని మరుక్షణంలోనే అనుకుంది. శారద మోజును ప్రభాకర్ ఆనాడే గ్రహించాడు. కాని దేనికైనా సమయం రావాలి అని మెదలకుండా వూరుకున్నాడు

"శారదా, ఇవ్వాళ నీ పుట్టినరోజు సంగతి కూడా నే మరచి పోలేదు. అందుకోసమే తెచ్చాను. ఈ చీరె విషయం నీకు గుర్తు చెయ్యక్కర్లేదను కుంటాను" అన్నాడు ప్రభాకర్.

శారద నిశ్చేష్టురాలయి నిలబడిపోయింది. ఆమె నోటివెంట క్షణకాలం మాట రాలేదు. ఆ చీరె కట్టుకుంది. పిల్లలతో సహా షికారుకు బయలుదేరారు. మొదట సూటిగా వసంత యింటికే వెళ్ళారు.

వసంత బిత్తరపోయి చూసింది ఎవరాఅని. 'శారదా! నువ్వేనా ఎంత మారిపోయావు' అనుకుంది మనస్సులోనే వసంత. శారద సగర్వంగా వసంత మొహంలోకి చూసింది. తమ యిష్టం వచ్చినంతసేపు తిరిగి తిరిగి వచ్చారు.

పిల్లలు అలసటకు నిద్దరపోయారు. అయితే శారద కంటికి నిద్ర రావటంలేదు. నిద్రపోతున్న పిల్లలవంక అదేపనిగా చూస్తోంది. నిద్రలో పిల్లలు యింకా అందంగా కనిపిస్తున్నారు. తనకు ఎంతో ధైర్యం వచ్చినట్లనిపించింది. తన భర్త ప్రభాకర్ వంక చూసింది. అదే మొహం అనాడు తన తలమీద చెయ్యిపెట్టి అక్షింతలు వేయించుకున్న సంఘటన కళ్ళకట్టినట్లయింది. తన భర్త అనాటి యువకుడే! తన కళ్ళల్లోనే యీమధ్య కొంత మార్పు వచ్చింది! ప్రభాకర్ కుడివైపు వత్తిగిలి పడుకున్నాడు కణతకు పైగా జుట్టు తెల్లగా మెరిసింది. ఆ తళతళలో అతను శారదకు యింకా సుందరంగా కనిపించాడు. ఆయన మొహంలో గాంభీర్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. శారద కళ్ళు విప్పి తన భర్త మొహం లోకి చూసింది. మళ్ళీ పిల్లల మొహంలోకి చూసింది. ఆమెకు రకరకాల ఆలోచనలు వచ్చి కలవరపెట్టాయి. జీవితంలో నలభై యేళ్ళు గడిచిపోయాయి. కాని యీ నలభై ఏళ్ళల్లోను తాను పొందినవి సామాన్యమైనవి కావు. వాటి విలువ యింత అని చెప్ప టానికి వీల్లేదు. ఏ స్త్రీకూడా పొందలేనివాటిని తాను సాధించ

గలిగింది. ఇది మామూలు విషయం కాదు, అనుకుంది శారద. ఆమె మనస్సులో చెలరేగిన అసంతృప్తి, విచారము ఇట్టే ఎగిరి పోయాయి. వాటితోపాటు వసంతమీద సుశీలమీద పూర్వపు అభిప్రాయాలు పోయాయి. వాళ్ళుకూడా తనతో సాటికాలేరని తన హృదయం ప్రతిధ్వనించింది. మెల్లిగా లేచి తన ప్రక్కమీద వత్తిగిలింది ఒక పెద్ద నిట్టూర్పు విడుస్తూ, ఇది తన సంతోషాన్ని, ఆనందాన్ని, సంతృప్తిని వెల్లడి చేసే నిట్టూర్పు.

— —